పశువులకు ముద్దచర్మ వ్యాధి ముప్పు

• మండలంలోని రెట్టగుంట గ్రామంలో ఓ పాడి ఆవుకు ముద్ద చర్మ వ్యాధి లక్షణాలు కనిపించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. బాధిత రైతుకు మూడు పాడి ఆవులున్నాయి. ఆవు అనారోగ్యం పాలై పాల దిగుబడి సైతం తగ్గింది.

• అనుపు గ్రామ పాడి రైతు రాము మందడికి రెండు పాడి ఆవులు ఉన్నాయి. ఒక ఆవుకు ముద్దచర్మ వ్యాధి లక్షణాలు కనిపించడంతో రైతు వెంటనే పశువైద్యుడిని సంప్రదించాడు. ఆయన వెంటనే టీకాలు వేయడంతో ప్రస్తుతం కొంతమేర ఆవు కోలుకుంది.


ముద్దచర్మ వ్యాధి బారిన పడిన పాడి ఆవు


ముద్దచర్మ వ్యాధి బారిన పడిన దూడ

• దూడలపై మరింత ప్రభావం
• టీకా వేయించకపోతే ప్రాణాపాయం
• పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న పశు వైద్యాధికారులు

గుడిపాల: మండలంలో 17,149 పాడి ఆవులు ఉన్నాయి. పశువులకు ముద్దచర్మ వ్యాధి వ్యాప్తిస్తుండడంతో పాడి రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఏటా అక్టోబర్-జనవరి నెలల మధ్య మాత్రమే వ్యాపించే ఈ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని గుడిపాల పశువైద్యాధికారి సాయిసుధ చెప్పారు. తెల్ల పశువులు అయిన ఆవులు, ఎద్దుల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధి తీవ్రత బర్రెల్లో కాస్త తక్కువగా ఉంటుంది. లంపీ స్కిన్ అనే వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధి పశువుల రక్తం పీల్చే దోమలు, ఈగలు, పిడుదుల వలన ఒక పశువు నుంచి మరో పశువుకి సులభంగా సంక్రమిస్తుంది. ఈ వ్యాధి కట్టడికి పశువైద్యశాఖ సిబ్బంది సెప్టెంబర్‌లోనే వ్యాధి నిరోధక టీకాలను వేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఈ వ్యాధి ముందుగా దూడలకు వ్యాపించి, వృద్ధి చెందుతోంది. వ్యాధి తీవ్రత ఉండే నాలుగు నెలల పాటు పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. మండలంలో మొత్తంగా 700 ఆవులు, దూడలకు ముద్దచర్మ వ్యాధి ఉన్నట్లు పశువైద్యులు గుర్తించారు. వ్యాధి బారిన పశువులు, దూడలను దూరంగా కట్టి ఉంచాలని చెబుతున్నారు.

వ్యాధి లక్షణాలు

ముద్దచర్మ వ్యాధి బారిన పడిన పశువుల్లో 104 డిగ్రీల నుంచి 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. చర్మంపై బొబ్బలు, బుడిపెలు, పొక్కులు ఏర్పడతాయి. నెమ్మదిగా అవి పగిలి పుండ్లుగా మారుతాయి. బుడిపెలు ఎక్కువగా తల, మెడ, పొదుగుతో పాటు చర్మం పలుచగా ఉండే ఇతర ప్రాంతాల్లో వస్తాయి. మేత సరిగా తినకపోవడం నోరు, ముక్కు నుంచి చొంగకారడం, పాల దిగుబడి తగ్గిపోవడం, అలసటగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పశువైద్యుడిని సంప్రదించాలి. నివారణకు సులభంగా జీర్ణమయ్యే గంజి లాంటి ఆహార పదార్థాలతో కొద్దిగా ఉప్పు కలిపి పశువులకు తాగించాలి. జ్వరం తీవ్రత తగ్గేవరకు ఓఆర్ఎస్ ద్రావణం క్రమం తప్పకుండా తాగించాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికామ్, ఆనాల్జిన్ మందులను వైద్యుల సూచన మేరకు వాడాలి. సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లయితే యాంటీబయాటిక్, న్యూమోనియా లక్షణాలు ఉన్నట్లయితే అవిల్, సీపీఎం వంటి మందులను వాడాలి.

ఇబ్బందులు పడుతున్నాం

మాకు ఉన్న మూడు పాడి ఆవుల్లో ఒక దానికి ముద్దచర్మ వ్యాధి వచ్చింది. దీంతో పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లాను. వారు చేయాల్సిన వైద్యం చేశారు.అప్పటికీ తగ్గకపోవడంతో బయట మెడికల్ షాపుల్లో వెయ్యి రూపాయలకు మందులను తీసుకొచ్చాను. పశు వైద్యులు వచ్చి వైద్యం చేయడంతో కొంతమేరకు వ్యాధి తగ్గింది.

–రామక్రిష్ణ, చిత్తపార

తగ్గిన పాల దిగుబడి

పాడి పశువులపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నా. నాకు ఉన్న 4 పాడి ఆవుల్లో రెండు ఆవులకు ముద్దచర్మ వ్యాధి వచ్చింది. దీంతో పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పశు వైద్యులు వచ్చి చికిత్స చేశారు. దీంతో పాటు ప్రైవేట్‌గా కొన్ని మందులు తెచ్చి ఇవ్వడంతో పాడిఆవుకు కొంత ఉపశమనంగా ఉంది.

–ప్రసాద్, మరకాలకుప్పం

టీకాలు వేయించడం శ్రేయస్కరం

వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరుచేసి చికిత్స చేయించాలి. పశువుల పాకలో దోమల బెడద లేకుండా ఉండటానికి దోమతెరలు వాడాలి లేదా వేపాకు పొగ వేయాలి. వ్యాధి నివారణకు ప్రతి ఏటా సెప్టెంబర్ నెలలో జీవాలకు టీకాలు వేస్తున్నాం. అయినా ముద్దచర్మ వ్యాధి సోకితే పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలి. మండలంలో వ్యాధి బారిన పడిన పశువులు, దూడలకు చికిత్స చేస్తున్నాం.

–సాయిసుధ, మండల పశువైద్యాధికారి

గతి తప్పిన మెప్మాలో విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని పట్టణ దారిద్ర్య నిర్మూలనా విభాగం (మెప్మా)లో అధికారులు విచారణ ప్రారంభించారు. ఇక్కడ పనిచేస్తున్న ఓ అధికారి వేధింపుల వల్ల ఓ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం, కొందరు రిసోర్సు పర్సన్లు మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించడానికి పెద్ద మొత్తంలో లంచాలు వసూలు చేయడంపై మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'గతి తప్పిన మెప్మా' శీర్షికన ప్రచురించిన కథనంపై జిల్లా మెప్మా అర్బన్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.రవీంద్ర స్పందించారు. విచారణకు ఆదేశించారు. దీంతో బుధవారం తిరుపతి మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ మనోహర్ రెడ్డి, జీవనోపాధుల సాంకేతిక అధికారి ప్రమీల చిత్తూరులో విచారణ చేశారు. మిట్టూరులోని పీడీ కార్యాలయంలో ఆర్పీలతో మాట్లాడి, మెప్మా కార్యాలయంలోని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మునిసిపల్ కార్యాలయంలో సీవోలతో మాట్లాడి, జరుగుతున్న పరిస్థితిని రాతపూర్వకంగా తీసుకున్నారు. అయితే ఇదే సమయంలో కొందరు రిసోర్సు పర్సన్లు విచారణలో తనకు అనుకూలంగా మాట్లాడాలని, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఉద్యోగిని ఆరోగ్యం బాగాలేదని రాత పూర్వకంగా ఇవ్వాలని ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. దీనికి పలువురు అంగీకరించలేదని సమాచారం.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జయంతి

గుడిపాల: ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జయంతి నియమితులయ్యారు. ప్రస్తుతం గుడిపాల తహసీల్దార్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డికి చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా కలెక్టర్ సుమిత్ కుమార్ పూర్తి బాధ్యతలను అప్పగించారు. దీంతో యాదమరి రీసర్వే డెప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయంతికి గుడిపాల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా

పూతలపట్టు నియోజకవర్గ అనుబంధ విభాగ అధ్యక్షులు వీరే!

కాణిపాకం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూతలపట్టు అసెంబ్లీ నియోజవర్గ అనుబంధ విభాగ అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. యూత్ విభాగ అధ్యక్షుడిగా ఎం తేజేష్‌రెడ్డి, మహిళ విభాగానికి బి. భారతి రైతు విభాగానికి పాలాక్షిరెడ్డి, బీసీ విభాగానికి పండు యాదవ్, ఎస్సీ విభాగానికి రామచంద్రయ్య, ఎస్టీ విభాగానికి వెట్రివేల్, మైనారిటీ విభాగానికి మున్నీర్, క్రిష్టియన్ మైనారిటీకి జయరాజ్, విద్యార్థి విభాగానికి హరిబందా, పంచాయతీరాజ్ విభాగానికి ఓబుల్‌రెడ్డి, వలంటీర్ విభాగానికి రాజేష్, వన్నియ విభాగానికి విజయ్‌కుమార్, వైఎస్సార్‌టీయూసీకి వెంకటప్రసాద్ ఈఎన్, లీగల్ విభాగానికి సుగుణశేఖర్‌రెడ్డి, కల్చరల్‌కు సుధీర్, సోషల్ మీడియాకు రెడ్డెప్ప, ఐటీకి ఉదయ్‌కుమార్, దివ్యాంగుల విభాగానికి చిరంజీవి, డాక్టర్స్ విభాగానికి మణిరాజ్, ఇంటలెక్చువల్స్ ఫోరానికి రాజరత్నంరెడ్డి, బూత్ కమిటీకి ప్రతాప్‌రెడ్డి, పబ్లిసిటీ విభాగానికి ఆవుల రమణ, ఆర్‌టీఐకి విజయ్, గ్రీవెన్స్‌కు భాస్కర్‌రెడ్డి నియంచినట్లు ప్రకటనలో వెల్లడించింది.

పార్టీ ఫిరాయింపులకు లొంగను


జయచంద్రారెడ్డి

పూతలపట్టు (కాణిపాకం): తాను ఎలాంటి పార్టీ ఫిరాయింపులకు, ఇతర పార్టీలతో కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడలేదని మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ జయచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం సాక్షితో మాట్లాడుతూ... తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను యాధృచ్ఛికంగా కలిశానని, కొందరు దొంగచాటుగా ఫొటోలు తీసి దీనిని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదని ఖండించారు. తనపై ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఊపిరి ఉన్నంతవరకు తాను వైఎస్సార్ సీపీలోనే ఉంటానన్నారు.

రసాయన ఎరువులతో భూసారం క్షీణత


మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: పంటల సాగులో ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడితే భూసారం క్షీణిస్తుందని ఏఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పొలకల, పేరయ్యగారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ, రైతులు అధిక దిగుబడి సాధించాలనే ఆత్రుతతో మితిమీరి రసాయన ఎరువుల వాడుతున్నారని, వీటి వల్ల భూసారం తగ్గి, భూమి లవణీయతను కోల్పోయి, దిగుబడులు గణనీయంగా పడిపోతాయని హెచ్చరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నియామకం


దామోదర్‌రెడ్డి

తవణంపల్లె: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాయలసీమ డివిజన్ వైస్ చైర్మన్‌గా ఎగువ తవణంపల్లెకు చెందిన దామోదర్‌రెడ్డిని నియమిస్తూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ నియామక పత్రం జారీచేశారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

శిల్పి ఎమ్మెస్ రమణ మృతి

పలమనేరు: పట్టణంలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతరలో అమ్మవారి శిరస్సును తయారు చేసే శిల్పి ఎమ్మెస్ రమణ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెస్ రమణతోపాటు వీరి కుటుంబీకులు ఎన్నో ఏళ్లుగా ఏటా అమ్మవారి శిరస్సును తయారు చేయడంలో సిద్ధహస్తులు. ఈనేపథ్యంలో వీరి కుటుంబం నుంచి ఇప్పటి దాకా రమణ అమ్మవారి శిరస్సును చేసేవారు. ఆయన అనారోగ్యంతో మృతిచెందడంపై పట్టణవాసులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మితి మీరిన వేగంతో వెళ్లకండి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మితిమీరిన వేగంతో వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోరాదని సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి హితవు పలికారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం పురస్కరించుకుని రోడ్డు భద్రతపై బుధవారం చిత్తూరులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి జడ్జి మాట్లాడారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదన్నారు. యువత ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. అలాగే ఎదురుగా వచ్చే వ్యక్తిని దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలన్నారు. లైసెన్సులు లేకుండా నడిపితే జరిమానా తప్పదని, విధిగా లైసెన్సులు పొందాలన్నారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, అప్రమత్తంగా బైక్స్ నడపాలన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు రాజేశ్వరరావు, నరసింహులు, దీపిక తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో ఆరు విద్యుత్ సమస్యలు


వినియోగదారులతో మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల వినియోగదారులు సమస్యలు తెలియజేశారు. మొత్తం 6 ఫిర్యాదులు అందాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. వీటిలో ఐరాల సెక్షన్ పరిధిలో మీటర్ పేరు మార్పు చేయాలని, చిత్తూరు రూరల్‌లో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరొకటి ఇవ్వాలని ఇద్దరు కోరారని, అలాగే చిత్తూరు రూరల్‌లో లైన్ మార్చాలని, రివిజన్ బిల్లు సమస్యలు రెండు వచ్చాయని చెప్పారు. సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే రచయితలుగా మాసపత్రిక భేష్..!


మంగళ విద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

• మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నిర్వహిస్తున్న మంగళ విద్యావాణి సంచిక విద్యార్థులకు ఉపయోగకరమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం మంగళ విద్యావాణి 33వ సంచికను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాల విద్యార్థులే రచయితలుగా వ్యవహరిస్తూ మాసపత్రిక నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి మాసపత్రికలు నిర్వహించడం హర్షణీయమన్నారు. మాసపత్రిక నిర్వహణకు తమ వంతు సహాయం అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులందరూ సమష్టి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు హెచ్.అరుణ శివప్రసాద్, విద్యార్థులు హేమ, లహరి, పునీత, టీచర్లు పిల్లారప్ప, భారతి, సంపంగి తదితరులు పాల్గొన్నారు.

లోతుగా ఫోర్జరీ విచారణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా పని చేసిన కళావతి సంతకం ఫోర్జరీపై తాలూకా పోలీసులు మరింతగా లోతుగా విచారిస్తున్నారు. అప్పటి తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. 15రోజులపాటు విచారణ చేపడుతున్నారు. కేసు ఓ కొలిక్కి వచ్చిన ఇందులో ఎంత మంది ఉన్నారో తేల్చాడానికి పోలీసులు విచారణలో కుస్తీ పడుతున్నారు. ఇన్నాళ్లు ఇద్దరు వీఆర్‌ఏ, ఫైనాన్స్ సిబ్బందిని విచారించగా... అందులోని అంశాల ఆధారంగా విచారణలో దిగారు. ఇందులో ముగ్గురు వ్యక్తుల హస్తం ఉన్నట్లు పూర్తి స్థాయిలో గుర్తించారు. అయితే మరిన్ని కీలక అంశాల ఆధారంగా విచారణ లోతుగా చేస్తున్నారు. టెక్నికల్ పరంగా విచారణ కొనసాగుతోందని పోలీసులు చెబుతున్నారు. ఫోన్ కాల్స్, ఫోన్ పే, జీపే లావాదేవీలు చూస్తున్నట్లు సమాచారం. ఫైనాన్స్ సిబ్బంది నుంచి ఎవరెవ్వరికి ఎంతెంత నగదు వెళ్లిందో గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. విచారిస్తే లోతుగా వెళ్లాల్సి వస్తోందని, ఫోర్జరీ దారులను త్వరలో మీడియా ముందు ప్రవేశ పెడుతామని ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ విషయంలో ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి

• కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

పెద్దపంజాణి: గ్రామస్థాయిలో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బుధవారం పెద్ద పంజాణి మండల కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం పలమనేరు ఆర్‌డీఓ భవాని, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీఓ బాలాజీతో కలసి తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్వోలు తప్పని సరిగా ప్రతిరోజూ గ్రామ సచివాలయాలకు వెళ్లాలన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పరిష్కారం చేయాలని, అర్జీదారులను ఆఫీసుల చుట్టూ తిప్పించుకోవద్దని చెప్పారు. పలువురు అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి సేవలు ప్రశంసనీయం


టి.పుత్తూరులో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి

తవణంపల్లె: అపోలో హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని టి.పుత్తూరులో సర్పంచ్ రవిచంద్రారెడ్డి అధ్యక్షతన అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ మాట్లాడారు. అపోలో హాస్పిటల్ అధినేత జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్‌చేశారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ రెడ్డిబాబు, మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ ఉష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, పాఠశాల హెచ్ఎం ఉష, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని దిగువమాఘం, అరగొండలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే దిగువమాఘంలో డాక్టర్ కేశవనారాయణ గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హరి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఓసీఎల్‌లో మాక్ డ్రిల్

యాదమరి (కాణిపాకం): అనుకోని విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ముందుంటుందని జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ అన్నారు. యాదమరి మండలంలోని ఐఓసీఎల్‌లో బుధవారం ఆ దళ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్తులు జరిగినప్పుడు ఎలా స్పందించాలో ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు..


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని శ్రీవివేకానంద (వీఎంకే) విద్యాసంస్థల నిర్వాహకులు మహేంద్ర, భాస్కరనాయుడు అన్నారు. బుధవారం నగరంలోని కొంగారెడ్డిపల్లెలోని ఓ కళ్యాణమండపంలో ఆ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని, పరీక్షల సమయంలో సమయం వృథా చేయరాదని, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని హితోక్తులు పలికారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ కబ్జా చేసి స్థిరాస్తి వ్యాపారం

• ఫిర్యాదు చేసినా పట్టించుకోని పెద్దపంజాణి తహసీల్దార్
• కోళత్తూరు గ్రామస్తుల ఆరోపణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దేవాలయ భూములు, రచ్చబండ భూమిని కబ్జాదారులు ఆక్రమించి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారని పెద్దపంజాణి మండలం కోళత్తూరు గ్రామస్తులు ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. గ్రామంలోని గంగమ్మ ఆలయం రణబేరమ్మ ఆలయం, సప్పలమ్మ గుడిలో గ్రామస్తులు పూజలు చేస్తున్నారని, ఈ గుడి ముందరి స్థలాన్ని రచ్చబండగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. అక్కడున్న భూమిలోని కొంత స్థలంలో సచివాలయం నిర్మించారని చెప్పారు. సచివాలయానికి ఆనుకొని ఉన్న స్థలంలో బెంగళూరుకు చెందిన మునిరామయ్య కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేస్తున్నారని, దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తాము ఫిర్యాదు చేసినందుకు గ్రామస్తులపై దౌర్జన్యాలు చేస్తున్నారని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి ఆక్రమణ గురైన భూములను పరిరక్షించాలని, గ్రామ అవసరాలకు ఆ భూములను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

ఊరగుట్ట భూములను పరిశీలించిన డీఆర్‌ఓ


మొగిలిలో ఊరగుట్ట భూములను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఊరగుట్ట భూములను బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పరిశీలించారు. మొగిలి ఊరగుట్టలో యానాదులు గొర్రెలు, మేకలు, పశువులు మేపుకుంటూ కొంత స్థలాన్ని శ్మశానంగా ఉపయోగించుకుంటున్నారు. ఈ భూములపై గ్రామానికి చెందిన కొందరు కన్నుపడింది. అగ్ర కులస్తులు భూకబ్జాకు పాల్పడ్డారు. యానాదులు సాగు చేసుకుంటున్న భూములకు దొంగ పట్టాలను సైతం పొందారు. ఇది తెలుసుకున్న సీపీఎం నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలుమార్లు అధికారులు ఊరగుట్ట భూములను పరిశీలించారు. ఈ నేపథ్యంలో డీఆర్‌ఓ కూడా పరిశీలనకు వచ్చారు. ఊరగుట్ట ప్రాంతంలో గురుకుల పాఠశాలకు 5 ఎకరాలు, అర్హులైన యానాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డీఆర్‌ఓను కోరారు. అలాగే, అగ్రవర్ణాల వారు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, వీఆర్‌ఓ భవిత, యానాదుల సంఘ కార్యదర్శి నిర్మల, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనకు తీసుకొచ్చిన పేయదూడలు

పేయ దూడల ప్రదర్శన


మహిళా పాడిరైతులకు బహుమతులు అందజేస్తున్న ఏడీఏ విజయమోహన్

గుడిపాల: మండలంలోని పిళ్లారికుప్పంలో బుధవారం సంకరజాతి పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయమోహన్ మాట్లాడారు.జెర్సీ జాతి ఆవులతో పాల దిగుబడి పెరగడమే కాకుండా పాల రేటు కూడా అధికంగా పొందవచ్చన్నారు. దీంతో పాటు ఇక్కడి వాతావరణానికి జెర్సీ ఆవులు అనుకూలంగా ఉంటాయన్నారు. హెచ్ఎఫ్ ఆవులు వేసవి తాపాన్ని తట్టుకోలేవని, అందువల్ల పాల రేటు కూడా సరిగ్గా రాదన్నారు. ప్రదర్శనకు తీసుకువచ్చిన 45 దూడలను పరిశీలించి ముగ్గురికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రవితేజ, సాయిసుధ, పీటీపీ డాక్టర్ ఆదిత్య, సిబ్బంది శివ, అబ్దుల్లా, జ్యోత్స్న, కన్నయ్య, కిషోర్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.